లవ్ స్టోరీ

పసి హృదయం

సాయంకాలం అయిదు గంటలయినా వీధంతా నిర్మానుష్యంగా వుంది. ఆ వీధి చివర గుబురు చెట్లతో అందమయిన పూల మొక్కలతో నిండి, చూసే వారి కళ్లను ఆకర్షిస్తోంది. ముచ్చటయిన ఇల్లు, ఇంటి ముందు ముచ్చటలాడే రకరకాల పువ్వులచెట్లు, మనకే చూస్తుంటే ముచ్చటేస్తుంది. వీధి గేటు నుంచి ప్రవేశ ద్వారం వరకు ఎర్రగా గచ్చువేయించి అటొక తొట్టి, ఇటొక తొట్టి పెట్టి వాటిల్లో ఏవో క్రోటన్ మొక్కలు వేశారు. ఆ గచ్చువారగా రకరకాల తెలుపు, ఎరుపు, పసుపు పూలచెట్లు గాలికి అటూ, ఇటూ ఊగుతూ దారిలో పోయే వారిని నవ్వుతూ పలకరిస్తున్నాయి. ఆ చట్ల నుంచి ఇక అంతా పచ్చటి గడ్డితో నిండి పోయివుంది. ఆ కనిపించే మందారపు చెట్లు దగ్గర రెండు వైరుతో అల్లిన కుర్చీలు, ఓ టీపాయ్ వేసి వుంది. ఇంటి కాంపౌండ్‌వాల్‌కి కుడివైపు మురళీ కృష్ణ అని వ్రాసి వుంది. ఎడమ వైపు గ్రీన్ హౌస్ అని వ్రాసివుంది. ఆ ముచ్చటైన ఇంటికి గ్రీన్ హౌస్ అనేపేరు అచ్చుకుదిరినట్లుగా వుంది.

బయటగేటు మీద చేతులు వేసేంత ఎత్తు లేక పోయినా గేటు ఎక్కి మరీ ఎవరి కోసమో ఎదురు చూస్తున్నాయి చిన్నారి కళ్లు. పేరు పల్లవి. తల్లి, పల్లవికి రెండు నెలలు వున్నప్పుడే పోయింది. తండ్రి మురళీ కృష్ణ మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆమె పేరు మాధవి. ఆమెకు ఓ ఆరు నెలల బాబు. కొడుకయ్యేసరికి మమకారం ఎక్కువ. రేపు లక్షలు తెచ్చి పెట్టేది వాడేగా. పల్లవి ఇప్పుడు సెకండ్ క్లాస్ చదువుతోంది.

"నీకేనా నాన్న మీద పెద్ద ప్రేమ, మాకు లేదా, వెళ్ళి బాబుని ఆడించు" అంటూ కసిరింది మాధవి. పల్లవి వెనుదిరగంగా తలవొంచుకొని బాబు దగ్గరికి నడిచింది. "బడాయి, గేటు దగ్గరికి వచ్చిన ఆయన ఇంట్లోకి రాకపోతాడా" గొణుగుతూ ఇంట్లోకి నడిచింది. "అమ్మాయి, కృష్ణా వచ్చాడా..?" "అబ్బే రాలేదండీ, వస్తే చెపుతాలేండి" అంటూ విసురుగా వంటిట్లోకి నడిచింది మాధవి. ఆమె పేరు శాంతమ్మ. పల్లవి వాళ్ల నానమ్మ. నిజానికి ఆ యింట్లో ఆమె స్థానం పెద్దకోడలు వున్నప్పుడే. తన కోడలు పోయినప్పుడే ఆమెతో పాటు తన స్థానం కూడా పోయింది. ఇప్పుడు ఆ ఇంట్లో ఆమెను నవ్వుతూ పలకరించేవాళ్ళు ఎవరూలేరు, ఒక్క పల్లవి తప్ప.

ఇంట్లో దీపాలు వెలిగాయి. స్కూటర్ శబ్దం రాగానే పల్లవి ఆనందంగా బయటకు వచ్చింది, "నాన్నా" అంటూ... మురళీ ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని "నీ కోసం రంగు రంగుల బొమ్మల గౌను తెచ్చాను" అంటూ ప్యాకెట్‌ని పల్లవి చిన్నారి చేతులకి అందిస్తూ. "మరి బుజ్జి గాడికి ఏం తెచ్చారూ" అంది కోపంగా మాధవి.

"వాడి ఆది నాకు గుర్తులేదు మధూ. అందుకే వాడికి డ్రెస్ తేలేదు" అంటూ బ్రీఫ్ కేస్ బల్ల మీద పెట్టాడు. "అవునులేండి, మీ కూతురు అదయితే బాగా గుర్తు వుంటుంది. ఎటుతిరిగి నా కొడుకు మీకెలా గుర్తుంటుంది" వ్యంగ్యంగా అంటూ ఓ ప్రక్క రాని కన్నీటిని తుడుచుకుంటూ లోపలికి వెళ్లి పోయింది మాధవి. "అది కాదు మధూ" – ఏదో చెప్పబోయాడు మురళి. "మీరేం చెప్పనక్కరలేదు" అంటూ వెనక్కి తిరిగింది మాధవి. భర్త చేతిలో వున్న చీర, బాబుకి పూలు టోపీని చూసి "అబ్బ మీరెంత మంచి వారండి" అంటూ వాటిని అందుకొంది మాధవి.

తలకి పోసుకొని ఒత్తుగా వున్న తన హిప్పీ క్రాఫ్‌ని దువ్వుకుంటూ నాన్న తెచ్చిన గౌనును వేసుకొని "నానమ్మా, ఎలావుంది" ఎంతో మురిసి పోతూ అడిగింది పల్లవి. "నీలా బంగారు తల్లిలా వుంది కన్నా" అంటూ ముద్దు పెట్టుకొంది పల్లీని నానమ్మ. గౌను మీద వున్న స్టిక్కరు కుందేలు బొమ్మను పదే పదే తాకుతూ ఏదో తెలీని ఆనందం పొందుతోంది పల్లవి. తనకాబొమ్మ చాలా బాగా నచ్చింది. అందుకే నానమ్మని ఎన్నో సార్లు అడిగింది బొమ్మ ఎలా వుందని. "బానేవుంది లేమ్మా, నీ గౌను, నీ అవతారం! ఇలా వచ్చి ఈ పూలు కొయ్యి" విసురుగా అంది మాధవి. మౌనంగా పూల చెట్ల దగ్గరకు నడిచింది పల్లవి. పూలు కోస్తూ మధ్య మధ్యలో తనకుందేలు బొమ్మకు ఏ కలర్ పువ్వు బాగుంటుందో ఒక్కొక్క పువ్వుని తాకిస్తూ బుట్టలో వేస్తోంది. మాధవికి కోపం ముంచుకొని వచ్చింది. "నీ బొమ్మ పాడుగాను! పూలన్నీ పాడు చేస్తున్నావా?" అంటూ ఆ గౌను కున్న స్టిక్కర్ కుందేలు బొమ్మని గట్టిగా లాగి పారవేసింది. పల్లవి మౌనంగా వుంది. మాధవి లోపలికి వెళ్లగానే మోకాళ్ల పై కళ్లను ఆ నించి భోరున ఏడవ సాగింది.

ఆప్యాయంగా ఆ చిన్నారి నిమురుతూ ఓదారుస్తూ దగ్గరికి తీసుకున్నాయి నానమ్మ చేతులు.

కేలండరులోని అంకెలు నడవడం ప్రారంభించాయి. ఆ రోజు శనివారం అవడంతో మురళీ 8 గంటల కల్లా స్కూటర్‌ని స్టార్ట్ చేసుకొని ఆఫీసుకి బయలు దేరాడు. అలా భర్తను పోనిచ్చి, పచ్చటి గడ్డిపై టవల్ వేసి బాబుని పడుకో పెట్టి పల్లవిని కూర్చోమని తను లోపల పని చేసుకుంటోంది. వాతావరణం అంతా చల్లగా వుంది. పల్లవి బాబుదగ్గర ఆడుకొంటోంది. నానమ్మ పత్తితో ఒత్తులు చేస్తూ బయటనే కూర్చొని వుంది. మాధవి కాసేపటికి పూల గిన్నె తీసుకొని వచ్చి పూలు కోస్తోంది. ఇంతలో ఓ తేలు బాబు పడుకున్న టవల్ దగ్గరకు వస్తోంది. దానిని ఎవ్వరూ పట్టించు కోవడంలేదు. ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమయి వున్నారు. పల్లవి దానిని బాబు దగ్గరకు రావడం చూసి గాభరాగా పక్కనున్న రాయిని దాని మీద వేసింది. ఆ తేలు దాని కింద నలిగి చచ్చి పోయింది. పెద్దగా శబ్దం అవ్వడంతో బాబు పెద్దగా ఏడవడం

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

మొదలు పెట్టాడు. అసలు విషయం కని పెట్టకుండా మాధవి పల్లవిని బాగా కొట్టి "నీకు ఎంత ధైర్యమే నా కొడుకు మీద రాయి వేయడానికి ప్రయత్నిస్తావా? నా మీద కోపం నా బాబు మీద చూపిస్తావా? పో... నా కళ్ల ముందు కనపడకు" అంటూ బాబుని దగ్గరకు తీసుకుంటూ ఆ రాయిని తీసింది— మాధవి కళ్లు ఒక్కసారిగా చెదిరాయి ! అసలు విషయం ఏమిటో అప్పుడు అర్థమయింది! ! "పల్లవీ..." అంటూ దగ్గరకు రమ్మని చేయి చాపింది. పల్లవి భోరున ఏడుస్తూ లోపలికి పరిగెత్తింది.

దెబ్బతిన్న చిన్నారి మనస్సు మాధవి దగ్గరకు పోవడానికి అంగీక రించడంలేదు.

మాధవి పల్లవిని దగ్గరకు రమ్మని బ్రతిమాలుతోంది. కాని కృంగి పోయిన పల్లవి మనస్సు అంగీక రించడం లేదు.

మధ్యాన్నం అవ్వడంతో మురళి ఆఫీసు నుంచి వచ్చాడు. స్కూటర్‌ని పోర్టికో క్రింద పార్కు చేసి లోపలికి నడిచాడు. లోపల జరిగే పరిస్థితి మురళికిఅర్థం కావడంలేదు. "మధూ ఏమయింది? పల్లవి ఎందుకు ఏడుస్తోంది? చెప్పవేం మధూ?" అంటూ మాధవిని గాభరాగా అడిగాడు. మాధవి తన వల్ల జరిగిన తప్పని ఏడుపు మధ్యలో చెప్ప సాగింది. "జరిగింది నా తప్పేనండీ, పల్లీ నా దగ్గరకు రావడానికి ఇష్టపడటం లేదు. తనని నేను బాగా కొట్టాను కదూ అందుకని! పిల్లలు దేవుడి స్వరూపాలు, వారి మనస్సులో దేవుడు ఎప్పుడూ కొలువై వుంటాడు. వారి హృదయాలలో మంచి ప్రవ హిస్తుంటుందని నాకు ఇప్పుడు తెలిసిందండీ... పల్లీ మీద కోపంతో నాకు మంచి చేసినా చెడు భావంతో చూసి దానిని బాగా కొట్టాను. దానిలో మంచిని నేను గుర్తించ లేక పోయాను. ఫలితం పల్లీ నా దగ్గరకు రావడంలేదు. పల్లీని నా దగ్గరకు రమ్మని చెప్పండి... నా పల్లీని నాదగ్గరకు రమ్మని చెప్పండి..." అంటూ భోరున ఏడుస్తూ మురళీ పై తల వాల్చింది మాధవి. "ఏడవకు మధూ... పిల్లలు దేవుడి స్వరూపాలు, వాళ్లు ఎంత సున్నితమో వారి మనస్సులు కూడా అంతే సున్నితం. ఏ మాత్రం మనం కోపం ప్రదర్శించినా వారి మనస్సులో అవే స్థిరపడి పోయి వారి మనస్సులు కృంగి పోతాయి. పల్లీ మంచితనాన్ని ఇప్పటి కయినా గుర్తించావు ఏడవకు మధూ. ఈ రోజు కాక పోయినా రేపయినా పల్లీ నీ దగ్గరకు వస్తుంది ఏడవకు మధూ ప్లీజ్..." అంటూ ఓదార్చాడు.

పిల్లలు దేవుడి ప్రతిరూపాలు. దేవుడి వూహలలో వాళ్ళు ఎప్పుడూ ఓలలాడుతూ వుంటారు. అందుకే వారి మనస్సులో మంచితనం నాటు కొని వుంటుంది. అంతే గానీ వారిలో చెడు ఏ మాత్రం నాటుకొని వుండదు. ★

ఎందుకు నేస్తం.....?

గాజుల సవ్వడిలో సంగీతం విని..
నీలి కురుల మధ్య నిశ్శబ్దంగా నవ్వే మల్లెల్ని...
చిరుగాలి తెరల మధ్య తేలివచ్చిన నవ్వుని...
వెన్నెలలో ఒంటరిగా ఎందుకు గుర్తుచేస్తావు?...
ఏ యుగాల వెనుకో... హృదయం తెరిచి...
సున్నితమైన స్వప్నాల్ని వెంట తీసుకొని...
ఎలా వచ్చావో కోటి వెన్నెల కాంతుల్ని...
హృదయం నిండా పరిచి...
స్నేహాన్ని....సాన్నిహిత్యాన్ని....
జీవితంలో పోరాడగల శక్తిని....
నాలో ఆవిష్కరించి...
నువ్వు మాత్రం...సంవత్సరాల మధ్య
చిక్కుకుపోయిన జీవితాన్ని వెతుకుతున్నావు...
నేనింకా సూర్యుని నిష్క్రమణంలో...
మల్లెల మాధుర్యంలోని... సౌందర్యమే
జీవితమని స్వప్నిస్తున్నాను!...
ఎప్పుడో ఆలోచనకో క్షణం దొరికినప్పుడు
బ్రతకడం తెలియని భావుకురాలని...
నిశ్శబ్దమైన ఆ నిట్టూర్పుని మాత్రం...
ఎందుకు నేస్తం... నాకోసం వృధా చేస్తావు?

—స్ఫూర్తి

చిరునామా:

టి.జయభారతి
కేరాఫ్ టి.శంకరరావు (లెక్చరర్)
28/760, టీచర్స్ కాలనీ
భక్తవత్సలనగర్, ఎ.కె.నగర్ పోస్ట్
నెల్లూరు — 524 004